## క్లుప్తంగా

### ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి



అవగాహన కల్పిస్తున్న మెరిబా సంస్థ సిబ్బంది

వెలుగోడు: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకొని ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చి, ఆంజనేయస్వామి ఆలయం, కొత్తబస్టాండ్ పరిసరాల్లో మెరిబా సంస్థ ఆధ్వర్యంలో ఐఈసీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఏరియా మేనేజర్ జుల్ఫీకర్ మాట్లాడుతూ ..హెచ్ఐవీ వారించడానికి అవగాహన ముఖ్యమని ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశామని తెలిపారు. చర్చి పాస్టర్ సునీల్, ఓఆర్‌డబ్ల్యూ ఈశ్వరమ్మ, రాణమ్మ, నాగేశ్వరి పాల్గొన్నారు.

### బుక్కాపురంలో క్షుద్రపూజల కలకలం



ముగ్గు వేసి పూజలు చేసిన దృశ్యం

మహానంది: మండలంలోని బుక్కాపురం శ్మశానం వద్ద క్షుద్రపూజల ఆనవాళ్లు ఆదివారం కలకలం రేపాయి. గుర్తు తెలియని కొందరు వ్యక్తులు శ్మశానంలో ముగ్గు వేసి, పసుపు, కుంకుమ, వివిధ రకాల ద్రవ్యాలతో కొందరు పూజలు చేయడాన్ని గ్రామస్తులు చూశారు. వారు ఊర్లోకి వెళ్లి స్థానికులు సమాచారమివ్వగా.. కొందరు అక్కడికి చేరుకునే లోపు పరారయ్యారని గ్రామస్తులు తెలిపారు. స్థానికులు 100 ద్వారా పోలీసులకు సమాచారమివ్వగా ఇద్దరు కానిస్టేబుళ్లు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.

### అలరించిన సంప్రదాయ నృత్యం



సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన నాట్యపురి డాన్స్ అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమములో మహా గణపతిం, శివపంచాక్షరి, దేవీస్తుతి, శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు, స్తోత్రాలకు సమితా మిశ్ర, జ్యోతిక, ప్రత్యూష, శ్రీదేవి, ఐశ్వర్య తదితరులు నృత్యం చేశారు .

### ఆత్మకూరులో కార్డెన్ సెర్చ్



పత్రాలు సరిగా లేని లారీలను స్వాధీనం చేసుకున్న సీఐ రాము

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ రాము తెలిపారు. ఇందులో భాగంగా సరైన ధ్రువ పత్రాలు లేని 16 మోటార్ సైకిళ్లు, 2 లారీలు, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించేందుకు అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

బేతంచెర్ల: జిల్లా కేంద్రమైన కర్నూలులో శనివారం జరిగిన అండర్-14 తైక్వాండో పోటీల్లో బేతంచెర్లకు చెందిన విద్యార్థినులు శ్రీవల్లి రెడ్డి, దివ్యశ్రీ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారిని తల్లిదండ్రులు, కోచ్‌లు వెంకటేశ్వర్లు, నాగన్న ఆదివారం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఫెన్సింగ్ క్రీడాకారిణికి సత్కారం

నంద్యాల(న్యూటౌన్): ఫెన్సింగ్ క్రీడాకారిణి పబ్బతి చిన్మయి శ్రేయకు ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేసినట్లు అధ్యక్షుడు సముద్రాల జనార్ధన్, ఆర్యవైశ్య నాయకులు పబ్బతి వేణుగోపాల్ తెలిపారు. అలాగే వెనుకబడిన మహిళలకు, వికలాంగులకు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం క్రీడాకారిణి చిన్మయి శ్రేయ మాట్లాడుతూ తల్లితండ్రి, గురువుల నుంచి శిక్షణ తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారిణిగా ప్రతిభా చాటానన్నారు. ఫెన్సింగ్ క్రీడల్లోనే కాకుండా కూచిపూడి, భక్తి, భగవద్గీత పఠనం, తదితర సాంస్కృతిక రంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

వర్షపు నీటిలో మునిగి మొక్క జొన్న పంట దెబ్బతినిందని చెబుతున్న ఈ రైతు పేరు మాబాషా. ఆత్మకూరు పట్టణ సమీపంలో రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. కొద్ది రోజుల క్రితం వరకు పైరు ఆశాజనకంగా ఉండటంతో దిగుబడిపై ఆశలు పెంచుకున్నాడు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట మొత్తం వర్షపునీటిలో మునిగి కుళ్లిపోయింది. ఎకరాలో పంట సాగుకు రూ.40 వేల వరకు వెచ్చించానని, వర్షంతో తాను రూ.80 వేలు నష్టపోయానని వాపోయాడు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీసం పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.



# కన్నీటి వాన!

- భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో నీట మునిగిన మొక్కజొన్న పంట
- ఆత్మకూరు డివిజన్‌లో 6వేల హెక్టార్లలో పంట నష్టం
- కోత దశలో పంటలు
- భారీగా నష్టపోయిన అన్నదాతలు
- సోయాబీన్స్, కంది, పత్తి రైతులదీ అదే పరిస్థితి
- ఆదుకోని కూటమి సర్కారు
- ప్రభుత్వంపై కర్షకుల ఆగ్రహం

ఆత్మకూరు: అధిక వర్షాలు డివిజన్‌లోని రైతన్నలను కన్నీళ్లు పెట్టించాయి. ముందస్తు వర్షాలకు మురిసిపోయిన అన్నదాత, భారీ వర్షాలతో ఆశాజనకంగా ఉన్న పైర్లు నీటమునగడంతో తీవ్రంగా నష్టపోయారు. వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంట భారీగా దెబ్బతినడం, నష్టతీవ్రతను ప్రభుత్వం, అధికారులు అంచనా వేయకపోవడంతో రైతన్నల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

**మొక్కజొన్న రైతుకు తీవ్ర నష్టం..**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆత్మకూరు డివిజన్‌లో వరుసగా రెండో ఏటా మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులు సాగు చేసిన మొక్కజొన్న, కంది, సోయాబీన్, మినుము పంటలు భారీగా దెబ్బతినడంతో నష్టాలే మిగిలాయి. డివిజన్ పరిధిలోని కరివేన, నల్లకాల్వ, కొత్త రామాపురం, బాపునంతపురం, వడ్లరామాపురం, ఇందిరేశ్వరం, అమలాపురం, శ్రీపతిరావుపేట, ముష్టపల్లి, పాములపాడు మండలం, ఇస్కాల, చెలిమెళ్ల, లింగాల, కొత్తపల్లి మండలం నందికుట, గోవలకుంట్ల, శివపురం, లింగాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, కొక్కిరంచ, దుద్యాల గ్రామాల్లో రైతులు సాగుచేసిన వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంట నీటమునిగింది. కోతకు వచ్చిన పంట మునిగిపోవడంతో తమ శ్రమంతా నీటి పాలైందని కన్నీటి పర్యంతమవుతున్నారు.

**పొలాల్లో ఆరని తడి..**

భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పాటు వరదస్వామి ప్రాజెక్టు, సిద్దాపురం చెరువు ఆనకట్టపై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో ఆ నీరంతా పంట పొలాలపై ప్రవహించింది. ఆత్మకూరు డివిజన్‌లో దాదాపు 6 వేల హెక్టార్లకు పైగా సాగు చేసిన మొక్కజొన్న, సోయాబీన్, కంది, పత్తి పంటలను ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పొలాల్లో నేటికీ వర్షపు నీరు తొలగలేదు. మరో 20 రోజులైనా కోతలు కోసే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. పొలాల్లో బురదగా ఉండడంతో కోత మిషన్ పొలంలో దిగడానికి కూడా అవకాశం లేదంటున్నారు.

**భారీగా నష్టం..**

సోయాబీన్, మొక్కజొన్న, పత్తి, కంది పంటలు వేలాది ఎకరాల్లో నష్టపోయారు. డివిజన్‌లో 6వేల హెక్టార్లకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. కాగా ఎకరాలో మొక్కజొన్నపంట సాగుకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు, సోయాబీన్, పత్తి, కంది పంటలకు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కోత దశలో పంటలు కోల్పోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది.

**చేతులెత్తేసిన వ్యవసాయ అధికారులు..**

భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నా వ్యవసాయ అధికారులు పొలాలవైపు కన్నెత్తి చూడటంఅ లేదు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, యూరియాను అధికంగా వేయాలని చెప్పడం మినహా వ్యవసాయ అధికారులు చేసిందేమీ లేదని రైతులు మండిపడుతున్నారు. పంటల నష్టాన్ని అంచనా వేయకపోవడాన్ని రైతులు తప్పుపడుతున్నారు.

**ఆదుకోని ప్రభుత్వం..**

పంటలు భారీగా దెబ్బతిన్నప్పటికీ కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టలేదు. కనీసం నష్టపరిహారం విషయంలో కనీస స్పందన కరువైంది. గతేడాది కూడా వర్షాలతో రైతులు పంటలు నష్టపోయినా పరిహారం చెల్లించలేదు. ప్రస్తుతం కూడా పరిహారం చెల్లించకపోవడం, బాధిత రైతులను ప్రజాప్రతినిధులు కనీసం పరామర్శించకపోవడాన్ని చూస్తే రైతాంగంపై ప్రభుత్వం స్పందనను అర్థం చేసుకోవచ్చు.

### మొక్కజొన్న పంట దెబ్బతింది



పది ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. పంట ఆశాజనకంగా ఉండటంతో దిగుబడి బాగా వస్తుందని ఆశపడ్డాను. అయితే ఒక్కసారిగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురవడంతో నాలుగెకరాల్లో పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. దాదాపు రూ.2 లక్షలు దాకా నష్టం వాటిల్లింది. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– రామచంద్రుడు, కొత్తరామాపురం రైతు



మొక్కజొన్న పొలాల్లో తగ్గని వరదనీరు

### మార్కుల జాబితా తీసుకెళ్లండి

జూపాడుబంగ్లా: 2024–25 పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాఠశాలల్లోంచి మార్కుల జాబితాను తీసుకెళ్లవచ్చని ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 8 ఉన్నత పాఠశాలలున్నాయన్నారు. గతేడాది పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒర్జినల్ మార్కుల జాబితాలు ఆయా పాఠశాలలకు వచ్చాయని చెప్పారు. విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సంప్రదించి తీసుకెళ్లవచ్చునని తెలిపారు. మార్కుల జాబితాను విద్యార్థులకు ఇచ్చే సమయంలో వారి నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయవద్దని హెచ్ఎంలకు సూచించారు. ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి ఫిర్యాదులొస్తే విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ప్రయాణికుడిపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

నందికొట్కూరు: పట్టణంలోని పటేల్ సెంటర్‌లో బసు ఎక్కేందుకు నిలబడిన ప్రయాణికుడిపై ఆర్టీసీ దూసుకెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 05జడ్0157 నంబరు గల బస్సు కర్నూలు నుంచి ఆత్మకూరు వెళ్తుండగా పటేల్ సెంటర్‌లో ప్రమాదం జరిగింది.

బస్సెక్కడానికి రోడ్డుపై నిలిచిన జూపాడు బంగ్లా మండలం తాటిపాడు గ్రామానికి బొల్లవరం శేషన్న కాళ్లపైకి ముందు చక్రం ఎక్కినట్లు ప్రయాణికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

---

## క్షణికావేశానికిలోనై జీవితాలు నాశనం చేసుకోవద్దు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ మల్లికార్జున

జూపాడుబంగ్లా: క్షణికావేశంతో ఘర్షణలు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ మల్లికార్జున సూచించారు. ఆదివారం ఉదయం మండలంలోని తూడిచెర్ల గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో బహిరంగ సభ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తగాదాల జోలికి వెళ్లకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించటం అలవర్చుకోవాలన్నారు. సమస్యలు నెలకొన్నప్పుడు ఆవేశానికి లోనై ఘర్షణలకు పాల్పడకుండా సత్వరమే పోలీసులను ఆశ్రయించి, సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈడిగ సరస్వతమ్మ, ఇంట్లో సోదాలు చేయగా అక్రమంగా బెల్టుషాపు నిర్వహించి విక్రయిస్తున్న 31 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆమెతో పాటు భర్త చంద్రశేఖర్‌గౌడుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఎలాంటి కాగితాల్లేని 16 బైక్‌లకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.

## ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగండి





ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు, మాట్లాడుతున్న సీఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ రైట్.రెవ. సంతోష్ ప్రసన్నరావు

నందికొట్కూరు: ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని సీఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ రైట్. రెవ. కామనూరి సంతోష్ ప్రసన్నరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చిని బిషప్ సందర్శించారు. సీఎస్ఐ టౌన్ చర్చి ఫంక్షన్ హాల్ నూతన గదిని ప్రారంభించారు. సంఘస్తులు నూతన బిషప్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. వారిని ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మార్గంలోనే నడవాలన్నారు. సమాజం క్రైస్తవులను ఆదర్శంగా తీసుకునే విధంగా జీవనం కొనసాగించాలని సూచించారు. సీఎస్ఐ నూతన చర్చి నిర్మాణానికి సంపూర్ణంగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ సంఘం కమిటీ సభ్యులు, క్రైస్తవులు, స్త్రీల మైత్రీ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## 13 గంటల పని రద్దుకు పోరాడాలి





మాట్లాడుతున్న ఏసురత్నం

ఆత్మకూరు: 13 గంటల పని విధానం రద్దుకు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కాయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన జీవో ప్రకారం ప్రతి కార్మికుడికి కనీస వేతనం ఇవ్వాలన్నారు. గతంలో కార్మికులకు 29 రకాల చట్టాలు ఉండేవని, అందులో ఎవరి హక్కుల కోసం వాళ్లు పోరాటం చేయడానికి అవకాశం ఉండేదన్నారు. ఆ చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు చట్టాలుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. సీఐటీయూ జాతీయ మహాసభలు 2026 జనవరిలో విశాఖపట్నంలో జరగనున్నాయని తెలిపారు. సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు రణధీర్, నాయకులు ఇస్మాయిల్, సురేంద్ర, నాగేశ్వరరావు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మా ఊరి విందు కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

## వైభవంగా మా ఊరి విందు



పూజలందుకున్న వాసవీ మాత

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మెయిన్ బజార్‌లోని అమ్మవారి శాలలో మా ఊరివిందు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అమ్మవారి పీఠాలతో పాటు వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ వసంతోత్సవ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మహిళలు పసుపు నీళ్లు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారు చీరతో అలంకరించి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు భవనాశి వాసు, కార్యదర్శి శేషు మాట్లాడుతూ దసరా పండుగ తర్వాత వచ్చే ఆదివారం రోజున ఈ కార్యక్రమం ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు పశు వైద్య శిబిరం

వెలుగోడు: రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు రేగడ గూడూరు పశు వైద్యశాలలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ఎం. సుమన్ తెలిపారు. శిబిరంలో చూడి కట్టని పశువులకు, ఎదకు రాని వాటికి వైద్యం చేసి ఉచితంగా మందులు ఇస్తామని చెప్పారు. అలాగే.. చూడి పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు, టీకాలు వేస్తామన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మహానందిలో భక్తుల సందడి

మహానంది: సెలవురోజు కావడంతో ఆదివారం మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం రాతి నంది, పెద్ద నంది ప్రాంతాలను తిలకించి గరుడనందీశ్వర ఆలయాన్ని సందర్శించారు.

### చౌడేశ్వరి ఆలయానికి విరాళం

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కోసం ఇదే గ్రామానికి చెందిన కీశేలు మొదుళ్ల రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనువరాలు గోమైదిలిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.25,516 విరాళం ఇచ్చారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అర్చకులకు విరాళం అందజేశారు. దాతలకు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

### మద్యం విక్రేత అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు అక్రమంగా బెల్ట్ షాప్ ద్వారా మద్యం విక్రయిస్తుండగా ఎస్ఐ రమణయ్య ఆ దివారం అరెస్ట్ చేశారు. సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు 50 క్వార్టర్ బాటిల్స్‌ను స్వా ధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తి స్థాయిలో విడుదల చేయాలి



చిన్మయి శ్రేయకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం తగదన్నారు. విద్యావ్యవస్థ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా లేదన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యాసంస్థలు అవస్థలకు గురవుతున్నాయన్నారు. దీనిపై సర్కారు స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఆర్‌నాయక్, రాజా, జిల్లా నాయకులు దినేష్, ఆయేషా, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాను జయప్రదం చేయండి





కరపత్రాలను విడుదల చేస్తున్న ఫ్యాప్టో, ఏపీటీఎఫ్ నాయకులు, నందికొట్కూరులో..

ఆత్మకూరు: ఈనెల 7వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే ఫ్యాప్టో రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు కె.శంకర్, జిల్లా సహాధ్యక్షుడు ఎం.ఎస్.ఉమ్మర్ ఉపాధ్యాయులను కోరారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఫ్యాప్టో డివిజన్ కన్వీనర్ ఎం.ఎస్.ఉమ్మర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నప్పటికీ ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలపై ఏమాత్రం స్పందించడం లేదన్నారు. దసరా పండగ కానుకగా ఒక డీఏ ప్రకటిస్తారని ఆశించినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. 12వ పీఆర్సీ నియమించి నివేదికను సమర్పించేలోగా మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57ను అమలుచేసి, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మరియు 11వ పీఆర్సీ బకాయిలను, సంబంధిత సెలవుల బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 7న ధర్నా చేపడుతున్నామని చెప్పారు. నాయకులు కె.విధుభూషణ్, పి.అబ్దుల్‌వహీద్, టి.కె.సుబ్రహ్మణ్యం, పి.దాస్, రామాంజనేయులు, పి.శివప్రసాద్, శంకర్‌రెడ్డి, డి.కుమార్ పాల్గొన్నారు.

**సీపీఎస్‌ను రద్దు చేయాలి**

నందికొట్కూరు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఫ్యాప్టో నాయకులు ముర్తుజావలి, ఆంజనేయులు కోరారు. ఆదివారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఛలో విజయవాడ కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బకాయి ఉన్న నాలుగు డీఏలను తక్షణమే ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 7వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు వాసు, హబీబుల్లా, పుల్లయ్య, నాగస్వామి, తిరుమలయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న సురేంద్ర



పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

ఆత్మకూరు: ఆర్ఎస్ఎస్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని మార్కెట్‌యార్డు ప్రాంగణంలో శతాబ్ది ఉత్సవాలకు ఆర్ఎస్ఎస్ కర్నూలు, నంద్యాల విభాగ్ ప్రచారక్ సురేంద్ర, ముఖ్య అతిథిగా, పట్టణ ఆర్ఎస్ఎస్ జేష్ఠ కార్యకర్త డాక్టర్ రంగసాయి పాల్గొన్నారు. సురేంద్ర మాట్లాడుతూ 1925 అక్టోబర్ 25న విజయదశమి రోజున డాక్టర్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారని, అప్పటి నుంచి దేశభక్తి, సామాజిక సమగ్రతను ప్రపంచానికి విస్తరిస్తూ, విపత్తుల నుంచి ప్రజలను రక్షిస్తూ, దేశ సంస్కృతి సంప్రదాయల పరిరక్షణకు కృషి చేస్తుందని చెప్పారు. వందేళ్ల ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని నేడు లక్షలాది స్వయం సేవకులను తయారు చేసుకున్న ఏకైక స్వచ్ఛంద సంస్థ ఆర్ఎస్ఎస్ అని కొనియాడారు. ఆత్మకూరు ప్రతినిధులు వాసుదేవరెడ్డి, బాణాల లక్ష్మీనారాయణ, మారం భానుమూర్తి, మహేష్ పాల్గొన్నారు.

## ఈ–కేవైసీని వేగవంతం చేయండి



ఎర్రమఠం గ్రామంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీడీ దాసు

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకంలో జాబుకార్డు కలిగిన ప్రతి వేతన దారుడికి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ దాసు సూచించారు. ఆదివారం మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, శివపురం, ఎదురుపాడు, కొక్కెరంచ గ్రామాలలో ఈకేవైసీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జాబుకార్డు కలిగిన ప్రతి ఒక్కరిని ఆన్‌లైన్ ద్వారా ఫేస్ ఐడెంటిఫికేషన్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నిద్ర సుఖమెరుగదు!

ఆకలి రుచి ఎరగదు, నిద్ర సుఖమెరుగదు అనే సామెత తెలిసిందే. అలసిన శరీరం విశ్రాంతి తీసుకునేందుకు పరుపులు కోరుకోదు. మహానంది నుంచి నంద్యాల వెళ్లే మార్గంలోని బొల్లవరం సమీపంలో ఓ పంట పొలం వద్ద పొలం పనులు చేసిన రైతన్న అలసిపోయి ఆదివారం మిట్ట మధ్యాహ్నం చెట్ల కింద చల్లటి గాలి వీస్తుండగా నేలపైనే కునుకు తీశాడు.

– మహానంది

